సాక్షి
నిజామాబాద్
శనివారం । 3 । ఫిబ్రవరి । 2024





## కబ్జా కోరల్లో హైదర్ కుంట!

బాల్కొండ శివారులోని హైదర్ కుంట ఉప కాల్వలను కొందరు అక్రమార్కులు ఆక్రమించుకున్నారు.

- 8లో ▸



## టీబీ రహిత జిల్లాగా..

వైద్య సిబ్బంది క్షేత్రస్థాయి నుంచి పనిచేస్తే నిజామాబాద్ టీబీ రహిత జిల్లాగా మారుతుందని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.9 /19.9


## వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

# బరిలోకి తటస్థులు!

- ఇందూరు పార్లమెంట్ స్థానం నుంచి పోటీకి ప్రయత్నాలు
- జాతీయ పార్టీ లేదా స్వతంత్రుడిగా పోటీకి సిద్ధమవుతున్న డాక్టర్ కేశవులు
- బీఆర్ఎస్ టికెట్టు ఆశిస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎస్ రావు
- బీజేపీ టికెట్టు కోసం దరఖాస్తు చేసుకున్న వ్యాపారి మంచాల జ్ఞానేందర్ గుప్తా

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఇందూరు స్థానం నుంచి పోటీ చేసేందుకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేని తటస్థులు కొందరు ఉత్సాహం చూపిస్తున్నారు. ఓట్లు రాబట్టడంలో తమ సామాజిక, వృత్తి పరమైన అంశాలు ఏ మేరకు అనుకూలంగా ఉంటాయో అంచనాలు వేసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఇద్దరు వైద్యులు, ఓ వ్యాపారి పేరు బయటకు వినిపిస్తున్నాయి. పార్టీల టికెట్లు ఆశిస్తున్న వీరిలో కొందరు స్వతంత్రంగానైనా పోటీ చేయాలని రంగం సిద్ధం చేసుకుంటున్నారు.



జ్ఞానేందర్ గుప్తా
డాక్టర్ కేశవులు
డాక్టర్ బీఎస్ రావు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇందూరు లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగేందుకు పలువురు తటస్థులు ఉత్సాహం చూపిస్తున్నారు. తాజాగా కొందరి పేర్లు బయటకు రాగా, మరికొందరు సైతం పోటీ చేసేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్‌కు చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణుడైన డాక్టర్ కేశవులు పార్లమెంట్ బరిలో నిలిచేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. కేశవులు వృత్తిపరంగానే కాకుండా ఇతర సామాజిక సేవా కార్యక్రమాల విషయంలోనూ సుపరిచితుడిగా ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్ర మేధావుల సంఘం చైర్మన్‌గా ఉన్న కేశవులు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. అవినీతి వ్యతిరేక వేదిక రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేశారు. అలాగే అవినీతి వ్యతిరేక అన్నాహజారే ఉద్యమ కమిటీ జిల్లా కన్వీనర్‌గా, బాబా రాందేవ్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ కమిటీ జిల్లా కన్వీనర్‌గా వ్యవహరించారు. ఆత్మహత్యల నిరోధక కమిటీ జిల్లా కన్వీనర్‌గానూ పనిచేశారు. ఈ క్రమంలో అనేక సామాజిక కార్యక్రమాలు చేసిన కేశవులు పద్మశాలి కులానికి చెందడంతో తనకు మరింతగా కలిసి వస్తుందని భావిస్తున్నారు. నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో పద్మశాలి ఓట్లు సుమారు 2 లక్షలు ఉన్నాయి. దీంతో స్వతంత్రంగా కానీ ఓ జాతీయ పార్టీ తరుపున కానీ పోటీ చేసేందుకు ఏర్పాటు చేసుకుంటున్నారు.

నిజామాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి, మంచాల శంకరయ్య గుప్తా ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ గుప్తా సైతం పార్లమెంట్ బరిలోకి దిగేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఈ మేరకు ఈ నెల 1న ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి దరఖాస్తును అందించారు. జ్ఞానేందర్ గుప్తా నిజామాబాద్, బాన్సువాడ, సిరిసిల్ల, హైదరాబాద్, సికింద్రాబాద్, కామారెడ్డిల్లో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను గత పది సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. ఈ పట్టణాల్లో స్వర్గ రథాలు నడుపుతున్న జ్ఞానేందర్ గుప్తా ఉచితంగా ఫ్రీజర్ బాక్సులు అందిస్తున్నారు. ఇప్పటివరకు 19వేల మృతదేహాలకు ఉచితంగా స్వర్గరథ యాత్ర వాహనాలు సమకూర్చారు. ప్రధాని మోదీ స్ఫూర్తితో ఇప్పటివరకు తెలుగు, హిందీ, ఆంగ్లం, మరాఠీ భాషల్లో సుమారు 5వేలకు పైగా భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నారు. మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నారు. ఆయన తాజాగా బీజేపీ ఎంపీ టికెట్టు కోసం దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

కరీంనగర్‌కు చెందిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎస్ రావు సైతం నిజామాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ తరుపున బరిలోకి దిగేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. కవిత పోటీ చేసే విషయమై ఇప్పటివరకు ఒక స్పష్టత లేకపోవడంతో ఈ టికెట్టు కోసం బీఎస్ రావు ప్రయత్నాలు చేస్తున్నారు. బీఎస్ రావు ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆయన అనేక వైద్యశిబిరాలు నిర్వహిస్తూ వస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలకు అవసరమైన సామగ్రిని అందిస్తున్నారు.

# కండక్టర్‌పై ప్రయాణికుడి దాడి

- టికెట్ తీసుకోవాలన్నందుకు వాగ్వాదం
- టిమ్ మిషన్, క్యాష్ బ్యాగ్ లాక్కుని పొదల్లో విసిరివేత
- కేసు నమోదు చేసిన పోలీసులు



పోలీసుల ఎదుటే కండక్టర్‌ను దుర్భాషలాడుతున్న ప్రయాణికుడు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): టికెట్ తీసుకోవాలన్నందుకు ఆగ్రహించిన ప్రయాణికుడు ఆర్టీసీ కండక్టర్ పై దాడి చేసిన ఘటన డిచ్‌పల్లి శివారులో జరిగింది. బాధిత కండక్టర్ రేయికుంట దేవదాసు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్-1 డిపోకు చెందిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు శుక్రవారం కామారెడ్డి నుంచి నిజామాబాద్‌కు వస్తోంది. కుప్రియాల్ ఎక్స్ రోడ్డు వద్ద దొంతుల రవి అనే ప్రయాణికుడు బస్సు ఎక్కాడు. అతని వద్ద కుప్రియాల్ నుంచి డిచ్‌పల్లి వరకు బస్‌పాస్ ఉంది. డిచ్‌పల్లి స్టేజీ రాగానే కండక్టర్ అతడిని బస్సు దిగాలని సూచించారు. అయితే అతడు తాను గాంధీనగర్ కాలనీ వద్ద గల ఎఫ్‌సీఐ గోడౌన్స్ వద్ద బస్సు దిగుతానని చెప్పగా నడిపల్లి వరకు టికెట్ తీసుకోవాలని కండక్టర్ చెప్పినా విన్పించుకోలేదు. దీంతో ఆర్టీసీ సీఐ సత్యనారాయణతో కండక్టర్ ఫోన్‌లో మాట్లాడించినా పట్టించుకోకుండా బూతులు తిట్టడం ప్రారంభించాడు. దీంతో డ్రైవర్ గాంధీనగర్ కాలనీ వద్ద బస్సును నిలిపివేశాడు. రవి బస్సు దిగుతూ ఆగ్రహంగా టికెట్ డబ్బులు నీకు లంచంగా ఇస్తున్నాను తీసుకో అంటూ కండక్టర్ చొక్కా పట్టుకుని బస్సులో నుంచి కిందకు లాగి పక్కనే ఉన్న డ్రెయినేజీపైకి తోసేశాడు. కండక్టర్ చేతిలో నుంచి టిమ్ మిషన్, క్యాష్‌బ్యాగ్ లాక్కుని రోడ్డుపక్కన ముళ్ల పొదల్లోకి విసిరేయడంతో టిమ్ మిషన్ ధ్వంసమైంది. బస్సులో ఉన్న ప్రయాణికులు కిందకు దిగి కండక్టర్‌ను పైకి లేపారు. వెంటనే డ్రైవర్, కండక్టర్లు డయల్ 100కు ఫోన్‌చేసి విషయం తెలపగా డిచ్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. సమాచారం అందుకున్న స్థానిక ఆర్టీసీ కంట్రోలర్ చందర్‌నాయక్, సీఐ అక్కడికి చేరుకున్నారు. ఆర్టీసీ అధికారులు, పోలీసులతో కూడా రవి దురుసుగా ప్రవర్తించాడు. కండక్టర్ దేవదాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు రవిని ఠాణాకు తరలించారు.

## విరగబూసిన మామిడి



మోపాల్ మండలం మంచిప్ప శివారులో..

సిరికొండ - వాల్గోట్ మార్గంలో..

ఈ యేడు మామిడి చెట్లు విరగబూసాయి. పూతతో చెట్లు కళకళలాడుతూ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. అధిక దిగుబడులపై రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

– సిరికొండ/సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

# వార్డెన్ రాక.. వసతులు లేక!

- చుట్టపు చూపుగా వస్తున్న వసతిగృహ అధికారి
- సమస్యలతో రెంజల్ ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థుల సహవాసం





తాగునీరు లేకుండా భోజనం చేస్తున్న విద్యార్థులు

రెంజల్(బోధన్): రెంజల్ ఎస్సీ బాలుర వసతి గృహ విద్యార్థులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. అందుబాటులో ఉండి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన వార్డెన్ వారానికి ఒకటి, రెండు రోజులు చుట్టపుచూపులా వచ్చి వెళ్తుండడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. హాస్టల్‌లో పనిచేస్తున్న సిబ్బందే విద్యార్థుల బాగోగులు చూస్తున్నారు. ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉంది. విద్యార్థులకు స్నానానికి వేడినీళ్లు అందించాల్సి ఉండగా చన్నీటితోనే స్నానమాచరిస్తూ గజగజ వణుకుతున్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సి ఉండగా, గ్రామ పంచాయతీ ద్వారా సరఫరా అవుతున్న నల్లా నీటినే తాగుతున్నారు. బాత్‌రూం డోర్లు కూడా సరిగ్గా లేవు. హాస్టల్‌లో 115 మంది విద్యార్థులు ఉండగా రోజూ 20 మంది వరకు గైర్హాజరవుతున్నట్లు తెలుస్తోంది. విద్యార్థులకు వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు.

### వారంలో రెండు రోజులే విధులకు..

వసతి గృహ అధికారి వారంలో రెండు రోజులే విధులకు హాజరవుతున్నట్లు ఆరోపణలు న్నాయి. ప్రతి గురువారం లేదా బుధవారం మధ్యాహ్నం సమయంలో ఇలా వచ్చి అలా వెళ్తారని తెలుస్తోంది. సెల్‌ఫోన్‌లోనే సిబ్బందికి అవసరమైన సూచనలు, సలహాలను అందిస్తున్నారు. బాధ్యతను విస్మరించి జిల్లా కేంద్రంలో ఉంటూ ఇక్కడి పనులను చక్కబెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని హాస్టల్‌లో వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఆన్‌లైన్‌లోనే విద్యాశాఖ ఫిర్యాదులు

- బోధన, బోధనేతర విభాగాల కోసం..
- అందుబాటులోకి రానున్న ప్రత్యేక యాప్
- నూతన విధానానికి కసరత్తు



నిజామాబాద్‌అర్బన్: ఫిర్యాదుల స్వీకరణ కోసం జిల్లా విద్యాశాఖలో నూతన విధానం అందుబాటులోకి రానుంది. బోధన, బోధనేతర విభాగాల నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తున్నారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వెంకటేశం సంబంధిత అధికారులతో సమావేశమై వివరాలను వెల్లడించారు. ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకురానున్న నేపథ్యంలో ప్రాథమిక వివరాల సేకరణ, ప్రత్యేక యాప్‌లో పొందుపరిచే ప్రక్రియను సిద్ధం చేసుకోవాలని డీఈవోలను ఆదేశించారు. దీంతో జిల్లాకు సంబంధించిన సమాచారాన్ని సేకరించే ప్రక్రియను డీఈవో ప్రారంభించారు. ప్రత్యేక యాప్ అందుబాటులోకి రానున్న నేపథ్యంలో ఎంఈవోలు, విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఫిబ్రవరి 25 తర్వాత యాప్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**అందరికీ అందుబాటులో..**

ఫిర్యాదుల స్వీకరణ కోసం రూపొందించనున్న ప్రత్యేక యాప్ జిల్లా విద్యాశాఖ పరిధిలోని ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి రానుంది. బోధన, బోధనేతర సిబ్బంది ఫిర్యాదు ఏదైనా యాప్ లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఫిర్యాదుదారు తన ఫోన్ నంబర్, ప్రాంతం, సమస్యకు సంబంధించిన వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయగానే, ఆ ఫిర్యాదు సంబంధిత అధికారి వద్దకు వెళ్తుంది. నిర్దేశించిన సమయంలో దానికి అధికారులు సమాధానం ఇస్తారు. ఫిర్యాదుదారు సెల్‌ఫోన్‌కు సమాచారం అందుతుంది. కార్యాలయాల చుట్టూ తిరుగకుండా, అధికారులను, హెడ్మాస్టర్లను కలిసే పని లేకుండా ఉన్న చోటు నుంచే తమ సమస్యపై విద్యాశాఖ ఉద్యోగులు ఫిర్యాదు చేసే అవకాశం ఏర్పడుతుంది. విద్యాబోధన, మౌలిక సదుపాయాల కల్పన, టీచర్ల గైర్హాజరు, మధ్యాహ్న భోజనం, పాఠశాలల భవనాల స్థితిగతుల తదితర సమస్యలపై ప్రత్యేక యాప్‌లో ఫిర్యాదు చేయొచ్చు. జిల్లా వ్యాప్తంగా డివిజన్ల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది.

| జిల్లాలోని పాఠశాలలు | |
|---|---|
| ప్రాథమిక | 789 |
| ప్రాథమికోన్నత | 137 |
| ఉన్నత | 269 |
| టీచర్లు | 4,897 |
| బోధనేతర సిబ్బంది | 167 |

### ఉన్నతాధికారులు నిర్ణయించారు



విద్యాశాఖకు సంబంధించి ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో స్వీకరించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. త్వరలోనే ప్రత్యేక యాప్ అందు బాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి ప్రాథమిక సమాచారం మాత్రమే అందించారు. – దుర్గాప్రసాద్, డీఈవో

### సక్రమంగా అమలు చేయాలి



ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల స్వీకరణను సక్రమంగా అమలు చేయాలి. అధికారులు ఫిర్యాదును లోతుగా పరిశీలించిన తర్వాతే స్పందించాలి. ఇబ్బందులు రాకుండా చూడాలి. యాప్ అందుబాటులోకి వచ్చిన తర్వాత స్పందిస్తాం. –మోహన్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

# పైసలివ్వందే.. పురిటి బిడ్డనూ ఇవ్వరు!

- ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది చేతివాటం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న బాలింతలు
- తమ దృష్టికి రాలేదంటున్న వైద్యాధికారులు





ఆర్మూర్‌టౌన్: పైసలివ్వందే.. పురిటి బిడ్డను కూడా కళ్లారా చూసుకోలేని దౌర్భాగ్య పరిస్థితులు ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో నెలకొన్నాయి. ఆస్పత్రికి వచ్చింది మొదలు డిశ్చార్జీ అయ్యి బయటకు వెళ్లే వరకు ప్రతిచోటా ముట్టజెప్పాల్సిందే.. లేదంటే సరైన వైద్యం అందడం దేవుడెరుగు.. పట్టించుకునే నాథులు కూడా ఉండరు. ఒకప్పుడు ప్రభుత్వ ఆస్పత్రికి రావాలంటే ప్రజలు భయపడేవాళ్లు. సరైన వైద్యం అందదని.. కనీసం పట్టించుకునేవారు కూడా ఉండరనే అభిప్రాయం ఉండేది. డబ్బులు ఖర్చయినా అప్పోసప్పో చేసి ప్రైవేటు దవాఖానాకు వెళ్లేవారు. కానీ ప్రస్తుతం మెరుగైన వైద్యసేవలు అందుతుండడంతో ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగింది. ప్రభుత్వం కూడా సర్కారు ఆస్పత్రుల్లో డెలివరీలు చేయించుకోవాలని పెద్దఎత్తున ప్రచారాలు నిర్వహిస్తోంది. దీంతో ప్రజలు కూడా ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీలు చేయించుకోవడానికి ముందుకు వస్తున్నారు. కానీ ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో డెలివరీకి వచ్చిన వారి నుంచి ప్రసూతి వార్డులో విధులు నిర్వహించే సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారు. పుట్టిన బిడ్డలను సంబంధింత బంధువుకు ఇవ్వాలంటే రూ. వెయ్యి నుంచి రూ. 13 వందల వరకు ఇవ్వాల్సిందే. లేకపోతే బిడ్డను ఇవ్వబోమని కరాఖండిగా చెబుతున్నారని బాధితులు గోడు వెల్లబోసుకుంటున్నారు. డెలివరీ అయిన మహిళ దుస్తులు మార్చాలన్నా రూ. 200 ఇవ్వాల్సిందే. యూరిన్ పైప్ మార్చాలన్నా.. కిట్ కావాలన్నా రూ. 100 చొప్పున ముట్టజెప్పాల్సిందే. ఇలా ప్రతిదానికి ఒక రేటు కట్టి ఇష్టం వచ్చినట్లు సిబ్బంది డబ్బులు దండుకుంటున్నారు. దీంతో ప్రసవానికి వచ్చిన మహిళలు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులుంటే ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లేవాళ్లమని.. డబ్బులు లేక ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే ఇక్కడా వసూలు చేస్తున్నారని వారు వాపోతున్నారు. డెలివరీ చేయించుకొని బయటకు వచ్చేసరికి రూ. 3వేల నుంచి రూ. 5వేల ఖర్చవుతోందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కిందిస్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

### బిడ్డ కోసం రూ. 1300 చెల్లించా..



ప్రభుత్వ ఆస్పత్రికి గత ఆదివారం డెలివరీ కోసం వచ్చాం. అయితే పాప పుట్టడంతో మాకు బిడ్డను ఇవ్వడానికి రూ. 1,300 ఇస్తేనే అప్పగిస్తామని చెప్పారు. దీంతో ఏమి తోచక అడిగిన డబ్బులు చెల్లించి పాపను తీసుకున్నాం.

– పుష్పలత, బాలింత బంధువు, రామన్నపేట

### రూ. 5వేల వరకు ఖర్చవుతుంది



డెలివరీ కోసం వస్తే ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి బయటకు వెళ్లే వరకు రూ. 5వేల వరకు ఖర్చవుతుంది. ప్రతి విషయానికి సిబ్బంది డబ్బులు అడుగుతున్నారు. లేకపోతే మాట వినడం లేదు. అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలి.

– లక్ష్మి, బాలింత బంధువు, బడాభీమ్‌గల్

### మా దృష్టికి రాలేదు



కిందిస్థాయి సిబ్బంది ఆస్పత్రిలో బాలింతల బంధువుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. ఇకనుంచి ఎవరు డబ్బులు చెల్లించవద్దని, డబ్బులు ఎవరైనా అడిగితే మా దృష్టికి తీసుకురావాలి.

– డాక్టర్ నాగరాజు, ఆర్మూర్ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

## న్యూస్‌రీల్

### ప్రత్యేకాధికారుల బాధ్యతల స్వీకరణ

- 530 జీపీల్లో 274 మంది..



సుభాష్‌నగర్: గ్రామపంచాయతీ పాలక వర్గాల గడువు ముగియడంతో శుక్రవారం నుంచి పల్లెల్లో ప్రత్యేక పాలన మొదలైంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీపీల్లో ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. 530 గ్రామ పంచాయతీలకు గాను 274 మంది గెజిటెడ్, సూపరింటెండెంట్ స్థాయి కలిగిన వారిని ప్రత్యేకాధికారులుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దాదాపుగా అన్ని జీపీల్లో ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించి, అందుబాటులో ఉన్న పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. నేడు పంచాయతీ రాజ్ అనుబంధ అధికారులు, ప్రత్యేకాధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఆ తర్వాత ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో గ్రామ పంచాయతీల కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి.

### ఎంఈడీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. నిజామాబాద్ నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో 1, 2, 3 సెమిస్టర్ బ్యాక్‌లాగ్, వర్సిటీ కాలేజ్‌లో 3, 5వ సెమిస్టర్ పరీక్షలు జరిగినట్లు ఆయన తెలిపారు. మొదటి రోజు మొత్తం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ నమోదు కాలేదన్నారు. వర్సిటీలోని పరీక్షా కేంద్రాన్ని ఆడిట్‌సెల్ డైరెక్టర్ తనిఖీ చేశారు.

### 5న డిచ్‌పల్లికి కేటీఆర్



డిచ్‌పల్లి: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొనేందుకు ఈ నెల 5న డిచ్‌పల్లికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నట్లు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిచ్‌పల్లిలోని జీ కన్వెన్షన్‌లో 5న ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశంలో కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశానికి రూరల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### ఆపరేషన్ స్మైల్‌లో 65 మంది పిల్లల గుర్తింపు

ఖలీల్‌వాడి: ఆపరేషన్ స్మైల్-10 ద్వారా 65 మంది పిల్లలను గుర్తించినట్లు సీపీ కల్మేశ్వర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల లోపు తప్పిపోయిన, వదిలివేయబడిన, కార్మికులుగా ఉన్న బాలబాలికలను గుర్తించినట్లు పేర్కొన్నారు. నిజామాబాద్ సబ్ డివిజన్‌లో 27 మంది, ఆర్మూర్ సబ్ డివిజన్‌లో 17 మంది, బోధన్ సబ్ డివిజన్‌లో 21 మందిని గుర్తించామన్నారు. నిజామాబాద్ డివిజన్‌లోని రెండో టౌన్ పరిధిలో బాలలను పనిలో పెట్టుకున్న ఇద్దరు యాజమానులపై కేసు నమోదు చేశామన్నారు. తల్లి దండ్రులు లేని పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ)కి అప్పగించినట్లు పేర్కొన్నారు. మిగతా పిల్లల్ని వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు చెప్పారు. తప్పిపోయిన పిల్లల వివరాలను 'దర్పన్ యాప్'లో నమోదు చేసి వారి అడ్రస్‌ను గుర్తించడానికి ప్రయత్నించినట్లు తెలిపారు.

### 'జిల్లా అభివృద్ధికి సలహాలివ్వండి'

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం తగిన సలహాలు, సూచనలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ టీఎన్జీవోస్, టీజీవో నాయకులను కోరారు. శుక్రవారం టీఎన్జీవోస్, టీజీవో నాయకులు వేరువేరుగా షబ్బీర్‌అలీని కలిసి సన్మానించారు. కార్యక్రమాల్లో టీజీవో జిల్లా అధ్యక్షుడు దేవేందర్, కార్యదర్శి సాయిరెడ్డి, సుంకరి భూమయ్య, జలగం శ్రీనివాస్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి సాయిలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### శతాధిక వృద్ధురాలు మృతి



రాజంపేట: మండల కేంద్రానికి చెందిన కంట్లికుంట్ల వెంకవ్వ(110) అనే శతాధిక వృద్ధురాలు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వెంకవ్వ కుమారుడు ఇటీవల ఓ ప్రమాదంలో మృతి చెందాడన్నారు. ఆమె వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న విషయం సాక్షి దినపత్రిక గుర్తుచేసింది. వెంకవ్వ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

### ముగిసిన ఉపాధి ప్రజావేదిక

గాంధారి: మండల పరిధిలోని 44 పీజీ పరిధిల్లో 2022–23లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ చేసి నిర్వహించిన ప్రజా వేదిక ముగిసినట్లు ఎంపీడీవో సతీశ్‌ శుక్రవారం తెలిపారు. గురువారం అర్ధరాత్రి వరకు ప్రజా వేదిక నిర్వహించినట్లు చెప్పారు. మస్టర్లతో అవకతవకలు, వైకుంఠధామం అసంపూర్తి పనులపై డీఆర్డీవో సాయన్న అసంతృప్తి వ్యక్తం చేశారు. దుర్వినియోగమైన డబ్బులు రికవరీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

### తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తాం

- నగర మేయర్‌ దండు నీతూకిరణ్‌



ఎడపల్లి: నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని నగర మేయర్‌ దండునీతూకిరణ్‌ అన్నారు. మండలంలోని అలీసాగర్‌ ఫిల్టర్‌ బెడ్‌ను శుక్రవారం సందర్శించారు. పట్టణానికి జరుగుతున్న తాగునీటి సరఫరాను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం అలీసాగర్‌లో నాలుగు ఫిల్టర్‌ బెడ్‌లు ఉన్నాయని, అవసరమైతే మరొకటి పెంచుతామన్నారు. పెరుగుతున్న నగర జనాభాను దృష్టిలో ఉంచుకొని అవసరాలను గుర్తించి చర్యలు చేపడతామన్నారు. ఆమె వెంట మున్సిపల్‌ డీఈ ఆనంద్‌ సాగర్‌, ఏఈ శంకర్‌, సిబ్బంది ఉన్నారు.

### కానిస్టేబుల్‌పై విచారణ

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ పోలీస్‌ డివిజన్‌కు చెందిన ఓ కానిస్టేబుల్‌ ఫైనాన్స్‌ ఇస్తున్న దానిపై శాఖ పరమైన విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. సదరు కానిస్టేబుల్‌ ఇంటి స్థలాలు, భూములు మార్టిగేజ్‌ చేసుకొని డబ్బులు ఇస్తున్నట్లు నగరంలో ప్రచారంలో ఉంది. దీనిపై పోలీసు అధికారులకు ఫిర్యాదు అందడంతో విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూనే ఫైనాన్స్‌ వ్యాపారం చేయడంపై పోలీసు అధికారులు సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన నివేదికను విచారిస్తున్న పోలీసులు నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిసింది.

# కబ్జా కోరల్లో హైదర్‌ కుంట!

- ఆక్రమణలకు గురైన కాలువలు
- నష్టపోతున్న ఆయకట్టు రైతులు
- పట్టించుకోని అధికారులు



నీరు లేక వెలవెలబోతున్న హైదర్‌ కుంట

బాల్కొండ: కబ్జాదారులకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వ భూములతో పాటు చెరువులు, కాలువలను సైతం కబ్జా చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వారికి అండగా ఉండాల్సిన అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాల్కొండ మండల శివారులోని హైదర్‌ కుంటకు కాలువల ద్వారా నీరు అందక పోవడంతో వెలవెల బోతుంది. ఈ కుంట ఆధారంగా 120 ఎకరాలకు సాగు నీరు అందడమే కాకుండా చుట్టుపక్కల భూముల్లో భూగర్భజలాలు పెరిగేందుకు దోహదపడుతుంది. కానీ ఈ కుంటకు నీటి సరఫరా చేసే కాలువలు కబ్జాకు గురై పూడ్చి వేయడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. ఆర్మూర్‌ మండలం ఫత్తెపూర్‌ శివారు గుండా ప్రవహించే నిజాంసాగర్‌ కాలువ ద్వారా ఈ కుంటకు ఉప కాలువల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. ప్రధాన కాలువ నుంచి కుంట వరకు ఉన్న ఉప కాలువలు కబ్జాకు గురయ్యాయని ఇటీవల బాల్కొండ తహసీల్దార్‌కు ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వానకాలంలో మాత్రమే కుంటలో నీరు వచ్చి చేరుతుంది. కానీ యాసంగిలో మాత్రం సీజన్‌ ప్రారంభం వరకే చుక్క నీరు లేకుండా ఎండిపోతుంది. దీంతో ఆయకట్టుకు నీరు అందకుండపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఆక్రమణకు గురైన కాలువలను వెలికి తీసి నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

**కుంట ఆక్రమణ..**

హైదర్‌ కుంట సుమారు 8 ఎకరాల విస్తీర్ణంతో ఉంటుంది. కుంటకు తూములు ఉన్నాయి. మిషన్‌ కాకతీయ పనుల్లో భాగంగా పూడికతీత, తూముల మరమ్మతులను అధికారులు చేపట్టారు. కానీ కుంటలో నీరులేక పోవడంతో కుంట చుట్టూ ఉన్న వారు కుంటను కబ్జాకు పాల్పడుతున్నారని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కుంట విస్తీర్ణం 5 ఎకరాలు కూడా లేదని వినిపిస్తోంది. నీరు లేక ఓ వైపు ఆయకట్టు రైతులు అవస్థలు పడుతుంటే కుంట కబ్జా కావడం రైతులకు మూలిగేనక్క మీద తాటి కాయపడ్డట్లు అవుతుంది. సంబంధిత అధికాలు పూర్తి సర్వే నిర్వహించి కుంట భూమిని కాపాడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

**కాలువను మూసి వేశారు**



హైదర్‌ కుంటలకు నీరు వచ్చె చిన్న కాలువను పైన ఉన్న వారు దున్నుకోవడంతో మొత్తం మూసివేశారు. అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పంటలకు నీరు అందకుండపోతుంది. పెద్దసార్లు ఎలాగైన ఆయకట్టు రైతులకు నీళ్లందేలా చూడాలి.

– నర్సయ్య, ఆయకట్టు రైతు, బాల్కొండ

## స్పాట్‌ కౌన్సెలింగ్‌ నిర్వహించాలి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలోని పీజీ కోర్సులు, ఎల్‌ఎల్‌బీ, బీఈడీ కోర్సులలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు స్పాట్‌ కౌన్సెలింగ్‌ నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్‌ చేశారు. తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రతి ఏడాది పలు పీజీ కోర్సుల్లో సీట్లు మిగిలిపోతున్నాయన్నారు. వాటిని భర్తీ చేయకుండా వదిలేయడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు నష్టపోతున్నారని, మిగిలిన సీట్లను స్పాట్‌ కౌన్సెలింగ్‌ ద్వారా భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తర్ల లక్ష్మణ్‌ రాంజీ, చార్వక కార్తిక్‌ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని బతికించారు..

- సాక్షి కథనంతో స్పందించిన దాతలు
- ఆపరేషన్‌ విజయవంతం కావడంతో తల్లిదండ్రుల హర్షం



ఆపరేషన్‌ తర్వాత తల్లిదండ్రులతో చిన్నారి

మాచారెడ్డి: నిరుపేద కుటుంబానికి ‘సాక్షి’ కథనం అండగా నిలిచింది. మండలంలోని లక్ష్మీరావులపల్లి గ్రామానికి చెందిన రాము, రజని దంపతుల కూతురు ప్రసన్న(5) గుండెకు చిల్లు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. 18 నెలలు చికిత్స నిర్వహించిన అనంతరం ఆపరేషన్‌ చేయాలని చెప్పారు. చేతిలో చిల్లి గవ్వ లేని ఆ తల్లిదండ్రుల బాధను సాక్షి 2022 ఏప్రిల్‌ 3న ప్రచురించింది.

దీంతో స్పందించిన దాతలు రూ.2.5 లక్షల వరకు విరాళం అందజేశారు. ఈ డబ్బులతో 18నెలలుగా చికిత్స అందించి, చిన్నారికి ఐదేళ్లు నిండిన అనంతరం గత నెల 22న కేర్‌ ఆస్పత్రి వైద్యులు ఆపరేషన్‌ చేశారు. దీంతో చిన్నారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. వార్త కథనంతో చిన్నారికి జీవం పోసిన సాక్షికి, విరాళాలు అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

### జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు నిశిత, వర్షిణి జాతీయస్థాయి అండర్‌–14 స్కూల్‌ గేమ్స్‌ సాఫ్ట్‌బాల్‌ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్‌ గోదావరి శుక్రవారం తెలిపారు. ఈ నెల 3 నుంచి 7వరకు ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రంలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులను ప్రిన్సిపాల్‌ గోదావరితో పాటు వైస్‌ ప్రిన్సిపాల్‌ వనిత, ఫిజికల్‌ డైరెక్టర్‌ లత, పీఈటీ మౌనిక, సాఫ్ట్‌బాల్‌ అకాడమీ కోచ్‌ వేముల మౌనిక అభినందించారు.

**రాష్ట్రస్థాయి పోటీలకు..**



డిచ్‌పల్లి: రాష్ట్రస్థాయి అండర్‌–17 వెయిట్‌ లిఫ్టింగ్‌ పోటీలకు డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మనోజ్‌, సిద్ధు ఎంపికైనట్లు హెచ్‌ఎం సీతయ్య శుక్రవారం తెలిపారు. ఈ నెల 3, 4, 5వ తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

# టీబీ రహిత జిల్లాగా మార్చాలి

- డీఎంహెచ్‌వో సుదర్శనం



వివరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మోపాల్‌: టీబీ నివారణకు క్షేత్ర స్థాయి నుంచి వైద్య, ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని, అప్పుడే టీబీ రహిత జిల్లాగా మారుతుందని డీఎంహెచ్‌వో సుదర్శనం పేర్కొన్నారు. మండలంలోని ముదక్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వార్డులు, ఫార్మాసిస్టు గది, ల్యాబ్‌ను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టీబీ నివారణకు సిబ్బంది చేసిన కృషికిగాను గతేడాది కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డు అందుకున్నామని గుర్తుచేశారు. టీబీని ప్రథమ దశలోనే గుర్తించే విధంగా ప్రజలకు వ్యాధి లక్షణాలు వివరించి అవగాహన కల్పించాలన్నారు. అలాగే వంద శాతం నార్మల్‌ డెలివరీలు ఇక్కడే జరిగేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న డెలివరీలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీలో ప్రతివారం జరుగుతున్న అమ్మ ఒడి, వ్యాక్సినేషన్‌, ఇతరత్ర కార్యక్రమాలు క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని ఆదేశించారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్యులు సంతోష్‌, సిబ్బంది నానిబాబు, సబిత, భూలక్ష్మి, నజీరుద్దీన్‌ తదితరులు ఉన్నారు.

## జీతాల చెల్లింపులపై ఉద్యోగుల హర్షం..

సుభాష్‌నగర్‌: ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటి, రెండో తేదీల్లోనే జీతాలు చెల్లిస్తుండటంపై ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయీస్‌ జేఏసీ చైర్మన్‌ అలుక కిషన్‌, జిల్లా ప్రధానకార్యదర్శి నేతి కుంట శేఖర్‌ శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి నెల సకాలంలో జీతాలు అందక ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ముఖ్యంగా బ్యాంకులకు ఈఎంఐలు, ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు కట్టుకునేందుకు అవస్థలు పడాల్సి వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి మాసంలో మొదటి వారంలోనే జీతాలు ఖాతాల్లో జమయ్యాయని, రెండోమాసంలో ఒకటో తేదీనే చెల్లించడం హర్షనీయమన్నారు. ప్రభుత్వానికి తమ మద్దతు ఉంటుందని, ప్రభుత్వ పథకాలను మరింత అభివృద్ధి చేస్తూ పని చేస్తామని పేర్కొన్నారు.

## ఆత్మస్థైర్యంతో క్యాన్సర్‌ను జయించొచ్చు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతిమారాజ్‌

- జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ ప్రతిమారాజ్‌

నిజామాబాద్‌ రూరల్‌: శారీరక వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో పాటు ఆత్మస్థైర్యంతో క్యాన్సర్‌ను జయించొచ్చని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ ప్రతిమారాజ్‌ అన్నారు. మాధవనగర్‌ శివారులోని ఇందూరు క్యాన్సర్‌ ఆస్పత్రిలో జాతీయ క్యాన్సర్‌ దినోత్స కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే త్వరగా నివారించవచ్చన్నారు. క్యాన్సర్‌బారిన పడిన మహిళలు ఆత్మస్థైర్యంతో ఉండే వ్యాధిని నివారించవచ్చని పేర్కొన్నారు. కాలుష్యం ఉన్న ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని సూచించారు. జిల్లాలో ఇందూర్‌ క్యాన్సర్‌ సెంటర్‌ లేకుంటే ఆరోగ్యశ్రీ ద్వారా రోబోటిక్‌ రేడియోథెరపీ చికిత్స చాలా ఖర్చుతో కూడుకున్నదన్నారు. దీనిని కూడా ఆస్పత్రి వారు ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. భారత దేశంలో క్యాన్సర్‌ను జయించడంలో అగ్రరాజ్యం కంటే ముందున్నామని ప్రముఖ వైద్యుడు రోబోటిక్‌ సర్జన్‌ ఇందూర్‌ క్యాన్సర్‌ ఆస్పత్రి మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ చిన్నబాబు అన్నారు. క్యాన్సర్‌ వ్యాధి నుంచి బయటపడిన వారు క్యాన్సర్‌ వ్యాధిగ్రస్తులకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. భారతదేశంలో సర్వేకల్‌ క్యాన్సర్‌ ఎచ్‌వీ టీకా ద్వారా నాలుగు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు తీసుకుంటే 90 శాతం క్యాన్సర్‌ రాకుండా ఉంటుందన్నారు. అనంతరం క్యాన్సర్‌ను జయించిన 15 మందిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు వినాయక్‌, కిరణ్‌కుమార్‌, ప్రద్యుమ్న రెడ్డి, మునిందర్‌ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు ప్రవేశ పరీక్ష

డిచ్‌పల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాలల్లో ఇంటర్‌ ప్రవేశానికి సంబంధించి ప్రవేశ పరీక్ష (సీఈఓ సెట్‌–2024)ను ఈ నెల 4న నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా కోఆర్డినేటర్‌ సంగీత, సుద్దపల్లి కళాశాల ప్రిన్సిపాల్‌ గోదావరి శుక్రవారం తెలిపారు. జిల్లాలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌/జేసీ, ధర్మారం(బి), కంజర, ఆర్మూర్‌(బి), సుద్దపల్లి, పోచంపాడ్‌, నవీపేట్‌, కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి, భిక్కనూర్‌, దోమకొండ, తాడ్వాయి, తాడ్కోల్‌, కొయ్యగుట్ట, తక్కడపల్లి, పెద్దకొడప్‌గల్‌, కామారెడ్డి డిగ్రీ కళాశాల పెద్ద ఎక్లార, బాన్సువాడ/బోర్లాం, నిర్మల్‌ జిల్లాలోని ముథోల్‌, లెఫ్ట్‌ పోచంపాడ్‌ జామ్‌, కడెం, భైసాలోని పరీక్షా కేంద్రాలలో ఈ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వెబ్‌సైట్‌ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్‌ చేసుకొని సకాలంలో హాజరు కావాలని సూచించారు.

### ఎంపీ టికెట్‌ కోసం దరఖాస్తు



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ ఎంపీ టికెట్‌ కోసం కాంగ్రెస్‌ పార్టీ నుంచి పోటీ చేసేందుకు నాయకుడు ఎన్‌ఆర్‌ఐ నరాల కల్యాణ్‌ శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తు చేశారు. శాసనసభ ఎన్నికల్లో సైతం నిజామాబాద్‌ అర్బన్‌ నుంచి పోటీ చేయడానికి ప్రయత్నాలు చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



## క్రైం కార్నర్‌

### ఒకరి అదృశ్యం



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గోసంగి కాలనీకి చెందిన చింతల సురేశ్‌ అనే యువకుడు అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి శుక్రవారం తెలిపారు. గత నెల 31న ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

**వివాహిత..**

నాగిరెడ్డిపేట: మండలంలోని ఓ తండాకు చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై రాజు శుక్రవారం తెలిపారు. గత నెల 30న ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### వివాహితను కాపాడిన పోలీసులు

బాల్కొండ: పోచంపాడ్‌ డ్యాంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన ఓ వివాహితను ముప్కాల్‌ పోలీసులు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. మెండోరా మండలం పోచంపాడ్‌కు చెందిన ఓ వివాహిత తన భర్తతో గొడవ పడి శుక్రవారం పోచంపాడ్‌ డ్యాంలో దూకి ఆత్మహత్యకు యత్నిస్తుండగా పెట్రోలింగ్‌కు వెళ్లిన ముప్కాల్‌ పోలీసులు గుర్తించి ఆమెను కాపాడారు. పీఎస్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్‌ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి కాపాడిన కానిస్టేబుల్‌ సాగర్‌, ఉమ్మెన పీసీ రమాదేవీలను ఎస్సై భాస్కరా చారి అభినందించారు.

### ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



బిమ్మంద(జుక్కల్‌): మండలంలోని పుల్కల్‌లో మంజీరా నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై మురళి శుక్రవారం తెలిపారు. ట్రాక్టర్లను పీఎస్‌కు తరలిస్తుండగా డ్రైవర్లు ఇసుకను రోడ్డుపై వేసేసి పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు ట్రాక్టర్లను పీఎస్‌కు తరలించారు. వాహనాలను రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామని ఎస్సై తెలిపారు.

### మాజీ సర్పంచ్‌ భర్త మృతి

నందిపేట్‌: మండలంలోని లక్కంపల్లి మాజీ సర్పంచ్‌ మూడ సుమలత భర్త మహేందర్‌(39) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందాడు. ఆర్మూర్‌ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడిగా ఉన్న మహేందర్‌ గతంలో హత్యాయత్నం కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. హత్య కేసులో నిందితుడిగా ఉండడంతో అతనిని బీఆర్‌ఎస్‌ నుండి సస్పెండ్‌ చేశారు. అనంతరం పార్టీలో చేర్చుకున్నారు. మహేందర్‌ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## డాల్ఫిన్‌ బేకరీలో తనిఖీలు



బేకరీ సిబ్బందితో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని డాల్ఫిన్‌ బెంగళూరు బేకరీని మూడు శాఖల అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. బేకరీని అగ్నిమాపక అధికారి మధుసూదన్‌ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి రెండంతస్తుల దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన పరికరాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్నిమాపక పరికరాలు అమర్చాలని ఆదేశించారు. ఆర్మూర్‌ సివిల్‌ సప్లై నాయబ్‌ తహసీల్దార్లు వినోద్‌ కుమార్‌, శ్రీనివాస్‌ బేకరీలోని వంటగదిని పరిశీలించగా గృహ వినియోగానికి సంబంధించిన నాలుగు గ్యాస్‌ సిలిండర్లు పట్టుకుని, వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి కేసు నమోదు చేశారు. ఆర్‌ఐ అశోక్‌ సింగ్‌ బేకరీలో ఆహార పదార్థాల తయారీ అధ్వానంగా ఉండటంపై దుకాణంలో పని చేస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గంజాయి నిందితుల రిమాండ్‌

గాంధారి: మండల పరిధిలోని నేరల్‌ తండాలో ఎక్సైజ్‌ టాస్క్‌ఫోర్స్‌ ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా సీఐ స్వప్న, సిబ్బందిపై దాడిచేసి పారిపోయిన నిందితులను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. తండాకు చెందిన దారావత్‌ రవీందర్‌, దారావత్‌ బిచ్యా, దారావత్‌ మీరాబాయి, బస్సీ జనార్దన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మరో నిందితుడు శ్రీకాంత్‌ పరారీలో ఉన్నట్లు చెప్పారు. నేరల్‌ తండాలో ఎండు గంజాయి ఉండనే సమాచారం మేరకు గత నెల 27న ఎక్సైజ్‌ టాస్క్‌ఫోర్స్‌ సీఐ స్వప్న ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి తండాలో దాడులు చేశారు. దారావత్‌ రవీందర్‌, శ్రీకాంత్‌ వద్ద కిలో ఎండు గంజాయి లభించింది.

కాగా నిందితులను ఎక్సైజ్‌ శాఖ జీపులో నిజామాబాద్‌కు తరలిస్తుండగా బస్సీ జనార్దన్‌ తన కారులో ఎక్సైజ్‌ వాహనాన్ని వెంబడించి చద్మల్‌ తండా వద్ద అడ్డుకుని జీపును ధ్వంసం చేసి, ఎక్సైజ్‌ కానిస్టేబుల్‌ సెల్‌ను లాక్కొని పరారయ్యాడు. దీంతో ఎక్సైజ్‌ సీఐ ఫిర్యాదు మేరకు ఐదుగురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పేర్కొన్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌ తరలించగా మరో నిందితుడు శ్రీకాంత్‌ పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

## పోలీసుల అదుపులో కిడ్నాపర్‌

- లభించని బాలుడి ఆచూకీ



సల్మాన్‌, బాలుడిని తీసుకువెళ్తున్న నిందితుడు

ఖలీల్‌వాడి: నగరంలో ఏడేళ్ల బాలుడి కిడ్నాప్‌ ఘటనపై అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నగరంలోని మాలపల్లికి చెందిన సల్మాన్‌ జనవరి 30న అదృశ్యమయ్యాడు. ఇంటి సమీపంలో ఆడుకోవడానికి వెళ్లిన బాలుడు తిరిగి రాలేదు. దీంతో బాలుడి ఆచూకీ కోసం కుటుంబీకులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఒకటవ టౌన్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మాలపల్లిలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించగా బాలుడు సల్మాన్‌ను స్థానికంగా ఉండే ఓ వ్యక్తి కిడ్నాప్‌ చేసి బైక్‌పై తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించిన వ్యక్తి ఆచూకీ వివరాలను తెలుసుకోగా విజయవాడలో ఉన్న ట్లు గుర్తించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు వచ్చి ఓ లాడ్జిలో ఉండటంతో సల్మాన్‌ను తీసుకెళ్లిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. లాడ్జిలో ఉన్న వ్యక్తి నుంచి పోలీసులు కొంత నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే బాలుడిని ఎక్కడికి తీసుకువెళ్లాడు..? ఏం చేశాడు అనే కోణంపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

### మహిళా మండలిలో పురుషాధిక్యం

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సంఘ సభ్యులు



వర్నిలోని ఆదర్శ మహిళా మండలి భవనం

వర్ని: మండల కేంద్రంలోని సత్యనారాయణ పురం ఆదర్శ మహిళా మండలిలో పురుషాధిక్యం చలామణి అవుతున్నట్లు సంఘ సభ్యులు ఆరోపించారు. గ్రామంలోని కొందరు ఊరి పెద్దలమని చెప్పుకొని రాజకీయంగా పైచేయి సాధించేందుకు భవనం కిరాయిలను ఆశించి మహిళా మండలిలో అజమాయిషీ చెలాయిస్తూ మహిళలను కించపరుస్తున్నారని ఆరోపిస్తూ సంఘ సభ్యులు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. వద్ధాప్యంలో ఉన్న మండలి చైర్మన్‌ను గుప్పెట్లో పెట్టుకొని వారికి మాయమాటలు చెప్పి సంతకాలు చేయించుకొని పురుషులే ఆధిపత్యం చెలాయిస్తున్నట్లు పేర్కొన్నారు. 1970లో కొందరు మహిళలు స్థాపించిన ఈ మండలిలో గత 25 ఏళ్లుగా ఒకే కమిటీ ఆధ్వర్యంలో నిర్వహణ జరుగుతోందని నాటి నుంచి నేటి వరకు సర్వసభ్య సమావేశం నిర్వహించలేదని, అకౌంట్స్‌, ఆడిట్‌, మినిట్స్‌ బుక్కు నిర్వహణ లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల రూ. 50 లక్షలతో మహిళా మండలి భవన నిర్మాణం చేపట్టగా అందులో 7 షటర్లతో షాపింగ్‌ కాంప్లెక్స్‌, పైన సంఘ సమావేశ భవనాన్ని నిర్మించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత భవనాన్ని సంఘానికి అప్పగించకుండా గ్రామ పెద్దలమని చెప్పుకునే కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారికి ఇష్టం వచ్చిన వారికి షటర్లను కిరాయికి ఇచ్చి రాజ్యమేలుతున్నారని ఆరోపించారు. వెంటనే కలెక్టర్‌ ఈ విషయంలో చొరవ తీసుకొని వద్ధాప్యంలో ఉన్న పాత కమిటీని రద్దుచేసి, నిర్వహణ మహిళా మండలికి అప్పగించాలని సభ్యులు వినతిపత్రంలో కోరారు.